
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.3, కనిష్ఠం 24.7




● ఆరు రకాల తరగతి గది సిట్టింగ్ పద్ధతులు



అందరూ.. ముందరే!

తరగతి గదుల్లోనే.. విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దబడుతుంది. కాబట్టి తరగతి గది అనేది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే పునాది లాంటిదని చెప్పవచ్చు. తరగతి గదిలో వారు నేర్చుకునే విషయ పరిజ్ఞానం, నైపుణ్యం, నైతిక విలువలు, సామాజిక అవగాహన విద్యార్థుల జీవితంలో ఎంతో తోడ్పాటునిస్తాయి. అయితే ఇటీవల తరగతి గదిని తెరపైకి తీసుకు వస్తూ మలయాళంలో నిర్మించిన 'స్థనార్థి శ్రీ కుట్టన్' సినిమా సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. ఇందులోని సన్నివేశాలు అందరిని ఆలోచించేలా చేస్తున్నాయి. బ్యాక్ బెంచ్ విధానాన్ని తొలగిస్తే విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి, అసమానతలు తొలగి సమానాలోచన కలుగుతుందని స్పష్టమవుతుంది.

ఆదిలాబాద్, జూలై 18(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎన్‌సీఈఆర్టీ)-2005లో రోస్ విధానంతో పాటు యూ సేఫ్, గ్రూప్స్ సిట్టింగ్, సర్కిల్ లేదా సెమీ సర్కిల్, ఫ్లెక్సిబుల్ సిట్టింగ్, స్టేడియం లేదా టైర్డ్ సిట్టింగ్ లాంటి 6 రకాల ఉత్తమమైన తరగతి సిట్టింగ్ విధానాల అమలుకు శ్రీకారం చుట్టింది. అయిన ఇప్పటి వరకు పాత పద్ధతిలోనే ఫస్ట్ బెంచ్.. లాస్ట్ బెంచ్ విధానమే కొనసాగుతోంది. ఇప్పటికే యూ సిట్టింగ్ విధానం కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో అమలు చేస్తున్నారు. అలాగే మన రాష్ట్రంలోనూ హైదరాబాద్ లాంటి పట్టణాలలో అమలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఆదేశిస్తే జిల్లాలోనూ యూ సిట్టింగ్ విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధమని అధికారులు పేర్కొంటున్నారు.

ముందు వెనుక ఉండదిక

యూ సిట్టింగ్ తరహాలో తరగతి గదిని ఏర్పాటు చేస్తే ఫస్ట్ బెంచ్.. లాస్ట్ బెంచ్ అనే సమస్యనే ఉండదు. దీంతో విద్యార్థుల్లో సమానభావన కూడా కలుగుతుంది. ప్రస్తుతం విద్యార్థుల ఎత్తును బట్టి తరగతి గదుల్లో కూర్చోబెడుతున్నారు. ఎందుకంటే ఎత్తుగా ఉన్న విద్యార్థులు ముందు వరుసలో కూర్చుంటే వెనుక వరుసలో కూర్చున్న విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉంటుంది. దీంతో ఎత్తుగా ఉన్న విద్యార్థులు బ్యాక్ బెంచీలో కూర్చోవడం తప్పనిసరిగా మారింది. ఇలా కొంత మంది విద్యార్థులను బ్యాక్ బెంచీలకు పరిమితం చేయడంపై తల్లిదండ్రుల నుంచి అభ్యంతరాలు, ఫిర్యాదులు వస్తున్నాయి. అలాగే ఉపాధ్యాయులు వెనుకబెంచీ విద్యార్థులపై సరైన దృష్టిని కూడా సారించ లేకపోతున్నారు.ఫస్ట్ బెంచ్ విద్యార్థులు తెలివిపరులని, బ్యాక్ బెంచీ వారు చదువుల్లో వెనుకబడి ఉంటారనే భావన కనిపిస్తుంది. ఇలాంటి అసమానతలకు యూ సిట్టింగ్ విధానంతో చెక్‌పెట్టడంతో పాటు ముందు వెనుక అనే మాటకే అవకాశం ఉండదని అందరూ ముందు వరుసలో కూర్చుండి చదువుకునే వెసులుబాటు కలుగుతుంది.

విద్యార్థులపై సమాన దృష్టి

తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యార్థులందరిపై సమాన దృష్టిని సారించే అవకాశం ఉంటుంది. యూసిట్టింగ్ ద్వారా విద్యార్థుల అభ్యాసన

(తరువాయి 6వ పేజీలో...)

- తరగతి గదుల్లో యూ సిటింగ్ విధానంపై జోరుగా చర్చ
- ఫస్ట్ బెంచ్.. లాస్ట్ బెంచ్ సమస్యకు శాశ్వత పరిష్కారం
- విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల పెంపునకు అవకాశం
- ఇరుకు గదులతో ఇబ్బందులే అంటున్న నిపుణులు
- ప్రభుత్వం ఆదేశిస్తే జిల్లాలో అమలుకు సిద్ధమంటున్న అధికారులు

చదువుకోవాలన్న పట్టుదల ఉండాలి

: కె.నవ్యశ్రీ, 7వ తరగతి విద్యార్థిని, కేఆర్‌కే కాలనీ



విద్యార్థులకు చదువుకోవాలన్న పట్టుదల ఉంటే ఫలితాలు బాగానే ఉంటాయి. యూ సిట్టింగ్ విధానం కొంత వరకు మంచిదే. దీంతో టీచర్ చెప్పే పాఠాలను సులువుగా వినే అవకాశం ఉంటుంది. అలాగే తరగతి గదిలో క్రమశిక్షణ అలవాటు అవుతుంది. వెనుక బెంచీలో కూర్చొని కథలు చెప్పుకునే అవకాశం ఉండదు.

కొంత ఇబ్బందైనా యూ సిట్టింగ్ విధానం మంచిదే..

: నర్ర నవీన్‌యాదవ్, ఉపాధ్యాయుడు, కేఆర్‌కే కాలనీ



చదువులో చురుకుగా ఉండే విద్యార్థులు ముందు బెంచీలో కొంచెం వెనుకబడిన విద్యార్థులు వెనుక బెంచీలో కూర్చోవడం సాధారణంగానే కనిపిస్తుంది. అయితే యూ సిట్టింగ్ విధానంతో ఇలాంటి పరిస్థితికి అవకాశం ఉండదు. చదువులో ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనే భావన మంచిదికాదు. విద్యార్థుల మధ్య స్నేహపూరిత వాతావరణాన్ని నెలకొల్పాల్సిన అవసరం ఉంటుంది. అయితే ఇరుకు గదల్లో ఈ విధానాన్ని అమలు చేయడం సాధ్యం కాకపోవచ్చు.

ప్రభుత్వం ఆదేశిస్తే అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తాం

: శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి, ఆదిలాబాద్



జిల్లాలో యూ సిట్టింగ్ విధానాన్ని ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. కాని ఈ విధానంలో కొన్ని లోటుపాట్లు కూడా ఉండే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా విద్యార్థులు బ్లాక్ బోర్డును చూడడంలో కొంత ఇబ్బంది పడాల్సి వస్తుంది. దీంతో మెడ నొప్పి, దృష్టి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. యూసిట్టింగ్ విధానం కంటే స్టేడియం, ఫ్లెక్సిబుల్ సిట్టింగ్ విధానం ఎంతో ఉత్తమమైనవిగా చెప్పవచ్చు.

ఫటా.. ఫట్...

రైతులకు కర్షక మిత్ర ద్వారా భారీగా రుణాలు

● కే.శ్రీధర్, డీసీసీబీ ఉమ్మడి జిల్లా సీఈవో



ప్రశ్న: డీసీసీబీ బ్యాంకు ద్వారా రైతులకు ఎలాంటి రుణాలను అందిస్తున్నారు?

జవాబు: బ్యాంకు పరిధిలో కర్షక మిత్ర ద్వారా రైతులకు అవసరమైన రుణాలను అందిస్తున్నాం. ఇందులో ఎకరాన రూ.2-రూ.3 లక్షల వరకు గరిష్ఠంగా రూ.15లక్షల రుణాలు ఇస్తున్నాం. వీటితో పాటు దీర్ఘకాలిక రుణాలను కూడా ఇస్తున్నాం.

ప్ర: ప్రస్తుతం డీసీసీబీ బ్యాంకు టర్నోవర్ ఎలా ఉంది?

జ: గతంలో పోల్చుకుంటే ప్రస్తుతం బ్యాంకు టర్నోవర్ భాగానే ఉంది. ప్రస్తుతం రూ.1800 కోట్ల టర్నోవర్‌తో లావాదేవీలను నిర్వహిస్తున్నాం.ఇందులో రూ.250 కోట్లు దీర్ఘకాలిక రుణాలను అందించాం.

ప్ర: ఈ యేడు రైతులకు పంట రుణాల కోసం ఎన్ని కోట్ల నిధులను కేటాయించారు?

జ: ప్రతియేడు మాదిరిగానే ఈ యేడు వానకాల సీజన్‌లో రైతులకు పంట రుణాలను అందివవ్వం జరిగింది. ఇప్పటి వరకు రూ.650కోట్ల నిధులను పంటరుణాలుగా అందించాం. బ్యాంకు పరిధిలో 90 శాతం రుణాలు రైతులకే అందిస్తున్నాం.

ప్ర: ఉమ్మడి జిల్లా పరిధిలో ఇప్పటి వరకు ఎన్ని కోట్ల మొండి బకాయిలు ఉన్నాయి?

జ: రుణాల వసూలును వేగవంతం చేస్తున్నాం. ఇప్పటి వరకు రూ.72కోట్ల బకాయిలు ఉన్నాయి. ఇందులో వన్‌టైం సెటిల్‌మెంట్ పథకం కింద 4449 అకౌంట్లను గుర్తించి సెటిల్‌మెంట్ చేస్తున్నాం.

ప్ర: డీసీసీబీ బ్యాంకు పరిధిలో గోల్డ్‌లోన్ రుణాలకు అవకాశం కల్పిస్తున్నారా?

జ: వ్యవసాయ రుణాలతో పాటు గోల్డ్‌లోన్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు రూ.300 కోట్ల వరకు గోల్డ్‌లోన్ రుణాలను 10.50 వడ్డీ రేటుతో అందజేయడం జరిగింది. అలాగే రూ.450 కోట్లు డిపాజిట్ రూపంలో ఉన్నాయి. ఇప్పటివరకు రూ.1300 కోట్ల నిధుల రుణాలను అందించాం.

ఆదిలాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి)



క్రీడా పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో

ఆశ్రమ పాఠశాలల్లో మెరుగైన విద్యనందించండి : పీవో

ఉట్నూర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఆశ్రమ క్రీడా పాఠశాలను పీఓ సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యబోధన చేయాలని అన్నారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో వర్షపునీరు నిలువకుండా నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్ టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డిగ్రీ ఉ??లైన నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి కే.రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 వరకు ఆన్‌లైన్ వెబ్ సైట్ ద్వారా అభ్యర్థులు సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ ఫౌండేషన్, పలు అంశాలపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉచితంగా శిక్షణ అందిస్తారని, ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'పీడీపీఎస్ పథకాన్ని రద్దు చేయాలి'

ఆదిలాబాద్ టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): పీడీపీఎస్ ధరల వ్యత్యాసం చెల్లింపులో జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నేపథ్యంలో వెంటనే పథకాన్ని రద్దు చేయాలని అఖిల పక్ష రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రి డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు వివరాలను వెల్లడించారు. పథకం సంబంధించిన చర్చను జరిపేందుకు శనివారం నిర్వహించే రౌండ్ టెబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. పథకం అమలైతే ప్రైవేట్ వ్యాపారాలు రైతుల నుంచి తక్కువ ధరకు చెల్లించి కొనుగోలు చేసే ఆస్కారం ఉందని, పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా, మండల పరిషత్‌లకు ఎన్నికల సామగ్రి



జడ్పీలో సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న సీఈవో, డిప్యూటీ సీఈవో



జడ్పీ కార్యాలయంలో నిల్వ చేసిన ఎన్నికల సామగ్రి

● ఏర్పాట్లను పరిశీలించిన జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి

ఆదిలాబాద్, జూలై 18(ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించే జిల్లా, మండల పరిషత్ ఎన్నికలకు సంబంధించిన సామగ్రిని జడ్పీ కార్యాలయ అధికారులు శుక్రవారం పంపిణీ చేశారు. జడ్పీ కార్యాలయంలోని మినీ హాల్‌లో సిబ్బంది మండలాల వారీగా ఎన్నికల సామాగ్రిని సిద్ధం చేసి మండల స్థాయి అధికారులకు అందజేశారు. ముఖ్యంగా ఏజెంట్ ఫాం, ఎన్నికల నియామవాళి, ఎన్నికలకు సంబంధించిన ఇతర పత్రాలను మండల అధికారులకు అందజేస్తున్నారు. త్వరలో నోటిఫికేషన్‌కు అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మండలాల వారీగా ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 20 జడ్పీటీసీ స్థానాలు, 166 ఎంపీటీసీ స్థానాలు, 473 పంచాయతీల స్థానాలను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీననుగుణంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రాథోడ్ రాజేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. ఎన్నికలకు అవసరమైన సామగ్రిని మండల స్థాయి అధికారులకు సక్రమంగా సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు.

విద్యార్థినుల స్వీయ రక్షణ కోసం జ్వాల : ఎస్పీ

మావల, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆపదలో అఘాయిత్యాలకి గురికాకుండా విద్యార్థినులు స్వీయ రక్షణను కలిగి ఉండాలని జిల్లా పోలీసు యంత్రాంగం ఆపరేషన్ జ్వాలా అనే సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జ్వాల పేరిట ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు కరాటే, మార్షల్ ఆర్ట్స్ శిక్షణ అందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో జ్వాల శిక్షణను ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. ముందుగా అతిథులకు విద్యార్థినులు సాదర స్వాగతం పలికారు. అనంతరం శిక్షణ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. విద్యార్థినులు, కరాటే శిక్షణ పొందిన బాలురు తమ మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలతో ఆకట్టుకున్నారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈమేరకు ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ బాలికలు ఆకతాయిల నుంచి ఎదురయ్యే వేధింపుల పట్ల మౌనంగా ఉండకుండా షీ టీంను సంప్రదించి సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. బాలికల్లో ఆత్మ విశ్వాసం కోసమే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కీర్తి, తదితరులున్నారు.



మొక్కను నాటి నీరు పోస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



విద్యార్థినులు ప్రదర్శిస్తున్న కరాటే విన్యాసాలు



జిమ్‌ను సీజ్ చేస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

స్టెరాయిడ్స్ ఇంజెక్షన్ల కలకలం

● జిల్లాకేంద్రంలోని లయన్ జిమ్‌లో ఇంజెక్షన్లు, మాత్రలు లభ్యం ● 20ఎంఎల్ డ్రగ్, 36 స్టెరాయిడ్స్ ట్యాబ్ లెట్స్, 3 డ్రగ్ ఇంజెక్షన్ల స్వాధీనం ● నిర్వాహకుడి అరెస్టు.. జిమ్‌ను సీజ్ చేసిన అధికారులు

ఆదిలాబాద్, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని లయన్ జిమ్‌లో స్టెరాయిడ్స్ ఇంజెక్షన్లు, మాత్రలు లభ్యం కావడం కలకలం రేపుతోంది. శుక్రవారం గుట్టుచప్పుడుకాకుండా ప్రమాదకర ఇంజక్షన్లను వాడుతున్న జిమ్‌పై అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎస్పీ అఖిల్ మహాజన్‌కు వచ్చిన సమాచారంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు వినాయకచౌక్‌లో గల జిమ్‌లో తనిఖీలు నిర్వహించారు. భయంకరమైన దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసేందుకు ఉపయోగించే స్టెరాయిడ్స్ ఇంజక్షన్లు, మాత్రలు లభ్యమైనట్లు తెలిపారు. గుండె వేగాన్ని తగ్గించే ప్రమాదకర ఇంజెక్షన్లను వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. వైద్యుల సలహా లేకుండా ఉపయోగిస్తున్న 20ఎంఎల్ డ్రగ్, 36 స్టెరైడ్ ట్యాబ్‌లెట్స్ 3డ్రగ్ ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. చట్ట వ్యతిరేకంగా జిమ్‌ను నిర్వహిస్తున్న నిర్వాహకుడు షేక్ ఆదిల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కండరాల ఎదుగుదల, ఎనర్జీ కోసం వినియోగించే వీటితో రోగ నిరోధక శక్తి తగ్గుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అలాగే లయన్ జిమ్‌ను సీజ్ చేశామని తెలిపారు. స్టెరాయిడ్స్ ఇంజెక్షన్లు, మందుల సరఫరాపై ఆరా తీస్తున్నామని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా బంద్‌కు సహకరించండి

● తుడుందెబ్బ జిల్లా కోశాధికారి బారిక్ రావు

ఇంద్రవెల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): జీవో 49 రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 21న చేపట్టనున్న ఉమ్మడి ఆదిలాబాద్ బంద్‌కు సహకరించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా కోశాధికారి కోట్నాక్ బారిక్ రావు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కులకు భంగం కలిగించే విధంగా ఉన్న 49 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 21న తలపెట్టిన ఉమ్మడి జిల్లా బంద్‌కు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న ఆదివాసీలు, గ్రామ పటేళ్లు, రాయిసెంటర్ సార్మేడీలు, ఆదివాసీ కుల సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాలు, వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ గౌరవ అధ్యక్షుడు జుగ్నాక్ భారత్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కనక గణేష్, నాయకులు ఆత్రం అశోక్, గేడం మారుతి, నైతం సీతారావ్, తదితరులు పాల్గొన్నారు.

23న విద్యా సంస్థల బంద్: ఎస్ఎఫ్ఐ

ఆదిలాబాద్ టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యారంగ పరిరక్షణ కోసం, కార్పొరేట్ విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా జూలై 23న చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నమొల్ల కిరణ్ అన్నారు. పట్టణంలోని బాశెట్టి మాధవరావ్ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం వామపక్ష విద్యార్థి సంఘాల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గేడం కేశవ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మడావి గణేష్, నాయకులు మారుతి, కొట్నాక్ సక్కు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బంద్‌ను చేపడుతున్నట్లు నేతలు తెలిపారు. జిల్లాలో ఫీ రెగ్యులేషన్ కమిటీని ఏర్పాటు చేయాలని పలు డిమాండ్‌లు చేశారు.



● విత్తనాలు నాటి నలభై రోజులైనా పెరగని పత్తి పంట

వర్షాలు లేక పెరుగుదల ఆగిన పత్తి పంట

● ఆందోళనలో ఆయా గ్రామాల పత్తి రైతులు

తాంసి, జూలై 18(ఆంధ్రజ్యోతి): మొదట్లో వర్షాలు సమృద్ధిగా కురిసినప్పటికీ గత పక్షం రోజుల నుంచి వర్షాలు మొండికేశాయి. దీంతో పత్తి పంట పెరుగుదల పూర్తిగా ఆగిపోయింది. ఏపుగా పెరగాల్సిన సమయంలో వర్షాలు కురవకపోవడంతో పత్తి పంట పెరుగుదల పూర్తి ఆగిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం తాంసి మండలంలో 36వేల హెక్టార్లలో ఈ పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం విత్తనాలు నాటి 40 నుంచి 45 రోజులు కావొస్తున్నాయి. అయితే పంట ఆశించిన స్థాయిలో పెరగడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఈ పాటికే ఒకసారి ఎరువులు, పురుగుమందు పిచికారి చేశామని, అయినా ఆశించిన స్థాయిలో కనిపించడం లేదని అంటున్నారు. విత్తనాల లోపమా? లేక వర్షాలా? అనే విషయంపై రైతులు మల్లగుల్లలు పడుతున్నారు. వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు పంట పొలలను సందర్శించి తగిన సూచనలు అందించాలని రైతులు కోరుతున్నారు.

అంగరంగ వైభవంగా బోనాల పండుగ

- పాఠశాలల్లో వేడుకలు
- ఆకట్టుకున్న పోతురాజుల నృత్యాలు

సంప్రదాయం.. ఆరోగ్యానికి శుభప్రదం!

వివరాలు 7వ పేజీలో....

జోరుగా కాలం చెల్లిన బీర్ల అమ్మకాలు

● బాలాజీ వైన్స్‌లో అడ్డగోలు దందా ● పట్టించుకోని ఎక్సైజ్ శాఖ



బాలాజీ వైన్స్‌లో విక్రయించిన కాలం చెల్లిన బడ్వైజర్ బీర్‌లు

ఆదిలాబాద్, జూలై 18 (ఆంధ్ర జ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కాలం చెల్లిన బీర్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అడిగేవారే లేరన్నట్లుగా లిక్కర్ వ్యాపారాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిసున్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బాలాజీ వైన్స్‌లో కాలం చెల్లిన బీర్లను విక్రయించడంతో మందుబాబులు వైన్స్ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. నిర్లక్ష్యంగా కాలం చెల్లిన బీర్లను అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్వైజర్ టీన్ బీర్ల కాల పరిమితి గత నెల 24తోనే ముగిసిపోయిన ఇంకా అమ్మకాలు జరపడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ ప్రముఖ లిక్కర్ వ్యాపారి అడ్డగోలు దందాలకు పాల్పడుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు అడిగేందుకు జంకుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇకనైనా ఎక్సైజ్ శాఖ అధికారులు వైన్స్ షాప్‌ల్లో తనిఖీలు నిర్వహించి కాలం చెల్లిన బీర్లను సీజ్ చేయాలని మందుబాబులు డిమాండ్ చేస్తున్నారు.

'మైక్రోఫైనాన్స్‌లో ఎమ్మెల్యేను బద్నామ్ చేస్తే సహించం'

ఉట్నూర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): డిజిటల్ మైక్రోఫైనాన్స్ ఛైర్మన్ కృష్ణతో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌కు ఎలాంటి సంబంధం లేదని అనవసరంగా ఎవరైనా ఎమ్మెల్యేను బదనాం చేస్తే సహించబోమని ఆదివాసీ గిరిజన పెద్దలు పేర్కొన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండలంలోని ద ఉర్గాపూర్‌లో జరిగినరాయి సెంటర్ గిరిజన పెద్దల సమావేశంలో వారు మాట్లాడారు. మైక్రోఫైనాన్స్ ఛైర్మన్ కృష్ణకు, వెడ్మఫౌండేషన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. అనవసరంగా వెడ్మఫౌండేషన్ పేరును అప్రతిష్ఠ పాలు చేసేందుకు సామాజిక మాధ్యమాలలో కొందరు ప్రచారం చేస్తున్నారని అలాంటి వారికి తగిన గుణపాఠం చెప్తామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన పెద్దలు మడావి మోతీరాం, కొడప గంగారాం, ఆత్రం తిరుపతి, వెడ్మకొద్దుపటేల్, తొడసం గుణవంత్‌రావు, తొడసం బాపురావు, మడావి కేశవ్‌రావు, సిడాం యశ్వంత్‌రావు, తొడసం భీంరావు, తొడసం మాణిక్‌రావు, మడావి భీంరావ పాల్గొన్నారు.

రోడ్లపై పశువులతో ఇబ్బందులు

ఉట్నూర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న రోడ్ల పై పశువులు కూర్చోవడంతో ప్రమాదాలు జరుగుతున్నందున వాటి నివారణ కోసం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ఉట్నూర్ సబ్ డివిజన్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం మండలం కేంద్రంలోని సబ్ డివిజన్ పోలీసు కార్యాలయంలో ఈ మేరకు ఏఎస్పీని కలిసి విచ్చల విడిగా ఉట్నూర్ పట్టణంలో తిరుగుతున్న పశువులతో వాహనదారులకు ఇబ్బందులు గురిఅవుతున్నాయన్నారు. తక్షణమే చర్యలు తీసుకొని ప్రమాదాలు పునరావృతంకాకుండా చూడాలని కోరారు.ఆయన వెంట దూట మహేందర్, సాజిద్ ఉన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్ టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసాల బారిన పడకుండా విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని సైబర్ డీఎస్పీ హసిబుల్ల అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నంబర్-2లో సైబర్ నేరాలపై విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సైబర్ మోసాలపై అవగాహన కల్పించేల విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సైబర్ డీఎస్పీ హసిబుల్ల మాట్లాడుతూ... రోజురోజుకీ అధునాతన సాంకేతికత అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాలు సైతం పెరుగుతున్నాయని అన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతం అందరి బాధ్యత

● ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్క రు తమ వంతు బాధ్యతగా సహకారం అం దించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో మహారాష్ట్ర బ్యాంకు ఉద్యోగి స్వామి ఆధ్వర్యంలో విద్యార్థులకు బుక్స్‌లు, బ్యాగులు, పెన్నుల పంపిణీ చేయగా కార్యక్రమ ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్ రెడ్డి, సాయి, ముకుంద పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయల్

సీజనల్ వ్యాధుల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జైనథ్, జూలై18 (ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు వచ్చే వర్షాకాలపు సీజనల్ వ్యాధుల పై అప్రమత్తంగా ఉండాలని జైనథ్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నైనత అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన జైనథ్ రైతు వేదిక భవనంలో సీజనల్ వ్యాధుల పై నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జైనథ్ ఎంపీడీఓ మహేశ్‌కుమార్, సీహెచ్ఓ అంజయ్య, హెల్త్ సూపర్‌వైజర్ వేణుగోపాల్, జైనథ్ కార్యదర్శి ముజీబ్ లతో పాటు గ్రామప్రజలు, రోగులు పాల్గొన్నారు.

భీంపూర్ : మండలంలోని అందర్‌బంద్, కరంజి(టీ), భీంపూర్, కస్తూర్బా పాఠశాలల్లో శుక్రవారం భీంపూర్ పీహెచ్‌సీ సిబ్బంది ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఫ్రైడే డ్రైడేలో భాగంగా నీరు నిల్వ ఉంచకూడదని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిషన్, మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్, మండల ఆరోగ్య విస్తీరణ అధికారి జ్ఞానేశ్వర్, సిబ్బంది రోహిదాస్ పాల్గొన్నారు.

అన్నాభాహు సాఠే అడుగు జాడల్లో నడవాలి

ఇంద్రవేల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): సాహిత్య సామ్రాట్ అన్నాబాహు సాఠే అడుగుజాడల్లో నడవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కాంబ్లే బాలాజీ మాదిగ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక మార్కెట్‌యార్డు ఎదురుగా సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నాభావు సాఠే మహారాష్ట్రలో జన్మించిన ఆయన తన రచనల ద్వారా ప్రజలను చైతన్య వంతులను చేసిన గొప్ప మేధావిగా ఎదిగి, సమాజం కోసం నిరంతరం కృషి చేశారని, ప్రతి ఒక్కరూ ఆయన అడుగు జాడల్లో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆందారే బాలాజీ మాదిగ, భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్యాగ్ సందీప్, మండల అధ్యక్షులు సూర్యవంశీ ఉత్తం, నాయకులు కాంబ్లే సునీల్, మాస్కే రాజవర్దన్, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

బీంపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని గోమూత్రి గ్రామానికి చెందిన హర్షిత (24) అనే యువతి గత సంవత్సరం కాలం నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. గురువారం సాయంత్రం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు వాహనంలో ఆదిలాబాద్ రిమ్స్‌కి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా తండ్రి నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీర్ సింగ్ నాయక్ తెలిపారు.

యూపీఎస్ ఎన్‌జీఓ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

ఆదిలాబాద్ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ యూపీఎస్ ఎన్‌జీఓ పాటశాలలో డాక్టర్ దత్తు మెమోరియల్ ట్రస్ట్, అమన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమ ముఖ్య అతిథిగా డీఈవో శ్రీనివాస్ రెడ్డి హాజరై నిర్వాహకులను అభినందించారు. నోట్ పుస్తకాలను అందించారు.

ఆదివాసుల సంక్షేమానికి కృషి : ఎంపీ గోడంనగేష్

ఆదిలాబాద్, జూలై18 (ఆంధ్రజ్యోతి):ఆదివాసుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్‌లు పేర్కొన్నారు. సాత్నాల, బేల, జైనథ్ మండలాల్లో ప్రధాన మంత్రి జన్‌మన్ నిధుల నుంచి మల్టిపర్‌పస్ సెక్టార్లకు వారు భూమి పూజచేశారు. పీవీటీజీలు కొలం ఆదివాసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రధానమంత్రిజన్‌మన్ పథకం పై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. "ఇందులో ఆదివాసీ నాయకులు బీజేపీ నాయకులు సుభాష్ మహేశ్, రాము, మహేందర్, అశోక్, విజయ్, సన్ని, కరుణాకర్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, ముకుందరావు, రమేష్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో మెడికల్ క్యాంపుల ఏర్పాటు

బోథ్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహంతో పాటు బోథ్‌లోని బాలుర వసతి గృహంలో శుక్రవారం వైద్యాధికారి డాక్టర్ నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని పరిశుభ్రత పాటించాలని భోజనం చేసే ముందు చేతులు కడుక్కోవాలని సూచించారు. ఎమ్ఎల్‌హెచ్‌పి డాక్టర్ ప్రియాంక, ఏఎన్ఎం స్వప్న, హెల్త్ అసిస్టెంట్ గోవింద్ పాల్గొన్నారు.

'పాత పనులకు బిల్లులు చెల్లించలేదు'

బోథ్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లించకపోగా కొత్తగా రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని భారతీయ జనతా పార్టీ నాయకులు, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మాజీ సభ్యులు జీవీ రమణ విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోనాల మండల కేంద్రంలో ప్రధాన రోడ్డు నిర్మాణానికి లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు స్థానిక నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

'పెండింగ్ వేతనాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం'

ఆదిలాబాద్ టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): వన మహోత్సవం, ఎన్ఆర్ఈజీఎస్ పనులను సమీక్షించడంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని టీటీడీసీలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఎంపీఓలు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఈసీలు, సీసీలు బహిష్కరిస్తామని ప్రకటించడం చర్చనీయంశంగా మారింది. తమకు పెండింగ్ లో ఉన్న నాలుగు నెలల వేతనాలను చెల్లించాలని, వేతనాలు విడుదల కాకపోవడం వల్లనే సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని ప్రకటించారు. డీఆర్‌డీం రవీందర్ రాథోడ్ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సిబ్బంది సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించడంతో ఆయన వారిని సముదాయించి సమస్యను ప్రభుత్వం, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని భరోసా కల్పించడంతో తిరిగి సమావేశం సాఫీగా సాగింది. వేతనాలను త్వరలోనే చెల్లించే అవకాశం ఉందని డీఆర్‌డీం రవీందర్ రాథోడ్ తెలిపారు.

అందరూ.. ముందరే!

(5వ పేజీ తరువాయి...)

సామర్థ్యాలు మరింతగా మెరుగు పడుతాయి. ఉపాధ్యాయులు బోధించిన విషయాన్ని నేరుగా గ్రహించి అవగాహన చేసుకునే అవకాశం కలుగుతుంది. బోధన తీరు మెరుగు పడడంతో విద్యార్థులకు విషయ పరిజ్ఞానం కలుగుతుంది. వెనుక బెంచీకి అవకాశం లేకపోవంతో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను మరింత శ్రద్ధగా వింటారు. అల్లరి చేయడం, ఒకరికొకరు మాట్లాడుకోవడం ఉండదు. తరగతి గదిని సులువుగా అదుపులో పెట్టేందుకు అవకాశం ఉంటుంది. నేరుగా విద్యార్థుల కదలికలపై దృష్టిని సారించవచ్చు.

అమలుపై సందేహాలు

జిల్లాలో ఈ విధానం అమలుపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. లాభాలతో పాటు కొన్ని లోపాలు కూడా ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఇరుకు గదులు ఉన్న పాఠశాలల్లో ఇది సాధ్యపడదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసలు నిబంధనల ప్రకారం తరగతి గది నిర్మాణం 18/36 విస్తీర్ణంలో నిర్మించాల్సి ఉంటుంది. కానీ దాదాపుగా అన్ని పాఠశాలల్లో 15/25 విస్తీర్ణానికి మించి తరగతి గదులు కనిపించడం లేదు. అలాగే ఒక్కో తరగతి గదిలో 25 నుంచి 30 మంది విద్యార్థులు మాత్రమే ఉండాలనే నిబంధన ఉంది. కానీ కొన్ని పాఠశాలల్లో 40 నుంచి 50 మంది వరకు ఇరుకు గదుల్లోనే చదువుకుంటున్న పరిస్థితి కనిపిస్తుంది. అలాగే విద్యార్థినీ, విద్యార్థులను ఎదురెదురుగా కూర్చోబెట్టడంతో కొంత ఇబ్బందికరంగా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యూ సిట్టింగ్ విధానంలో బ్లాక్ బోర్డును వన్‌సైడ్‌గా చూడాల్సి ఉండడంతో విద్యార్థులు మెడనొప్పి లాంటి సమస్యలతో చదువులపై ఏకాగ్రతను కనబర్చకపోవచ్చు. ఇప్పటికీ కొన్ని పాఠశాలల్లో బెంచీలు అందుబాటులో లేకపోవడంతో నేలపై కూర్చొని చదువుకుంటున్న పరిస్థితి కనిపిస్తుంది.

ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన

నార్నూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అర్హులైన లబ్ధిదారుల పనులను శుక్రవారం గృహ నిర్మాణ శాఖ అధికారి దుర్గం శ్రీకాంత్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రాథోడ్ సుష్మా ఇంటి నిర్మాణం విషయం లబ్ధిదారుల పని గురించి అడిగి తెలుసుకున్నారు. మొదటి విడత బిల్లు చెల్లింపు అందడంతో ఇక రూఫ్ కోర్డినేటింగ్ రెండవ బిల్లు అందిస్తామని తెలిపారు. వారి వెంట గ్రామస్తులు కోరేలా మహేందర్, పవన్, శ్రీకాంత్ ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నార్నూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త ఉండాలని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు జితేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని టీఎస్-ఈఎంఆర్ఎస్ కాలేజీలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి హాజరై అస్వస్థకు గురైనా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. ఆరోగ్యంపై విద్యార్థులకు పలు మంచి సలహా సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు ప్రిన్సిపాల్ ఆంజనేయులు, హెచ్ఈఓ తులసీదాస్, హెల్త్ సూపర్ వైజర్ చౌహన్ చరణ్ దాస్, ఈశ్వర్, గోకుల్, జంగుబాయి, ఏఎన్ఎం జ్యోతి,లక్ష్మి, రంబ పాల్గొన్నారు.

విద్యార్థులు ఓపెన్ స్కూల్ అడ్మిషన్ తీసుకోవాలి

నార్నూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గాదిగూడ మండలంలోని బడి ఈడు విద్యార్థులు ఎవరైనా ఉంటే వారి కోసం ప్రభుత్వం ఓపెన్ స్కూల్ అడ్మిషన్‌లకు మంచి అవకాశం కల్పించింది. విద్యార్థులు చదువుపై దృష్టి సరించేలా చూడాలని రాజ్ గొండ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మెస్రం శేఖర్ బాబు అన్నారు. ఝరి ఆశ్రమ పాఠశాలలో నూతన సెంటర్ మంజూరైనందున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టాడని కేసు నమోదు

ఆదిలాబాద్ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఇరు వర్గాలు, గ్రూపుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని పద్మవార్ రాకేష్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. శాంతిభద్రతల సమస్య తలెత్తేలా అసత్యలను ప్రచారం చేస్తూ పోస్టులు పెట్టిన నేపథ్యంలో కేసు నమోదు చేసి విచారణ జరిపినట్లు పేర్కొన్నారు.

జీఎన్ఆర్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని జీఎన్ఆర్‌కాలనీలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పర్యటించారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో ప్రజలు వరద ముంపుతో భయాందోళనకు గురవుతుండడంతో ముందస్తుగానే ముంపు ప్రభావిత ప్రాంతమైన కాలనీలో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతరం అధికారులను ఆదేశించి ముంపునకు కారణమైన కాలువ పునరుద్ధరణ పనులు వేగవంతం చేసి వరద సమస్య పరిష్కారం దిశగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మహిళా శక్తి సంబరాల్లో పాల్గొన్న బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించిన మహిళాశక్తి సంబరాల్లో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... మహిళా సంఘాల రుణాల ద్వారా మహిళలు అనేక పెట్టుబడులు పెట్టి లాభాలు ఆర్జించడం హర్షణీయమన్నారు. మహిళా సంఘాల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అధికారులు, మహిళా సంఘాల అధ్యక్షులు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

హెల్త్‌సబ్‌సెంటర్ నిర్మాణ పనులకు భూమిపూజ

నిర్మల్ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాణాపూర్ గ్రామం నుంచి గంగాపూర్ తండా వరకు రూ. 2.40 కోట్లతో ఆర్అండ్‌బీ బీటీరోడ్డు నిర్మాణ పనులకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు రాంనాథ్, మాజీ ఉమ్మడి మండల పరిషత్ అధ్యక్షులు వి.సత్యనారాయణ గౌడ్, నాయకులు జమాల్, సత్యం చంద్రకాంత్, మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి, నాయకులు గంగయ్య, నాగభూషణం, అనిల్, అశోక్, రమేష్, వెంకట్రావు, సుభాష్, మోహన్, నారాయణ, నరేందర్, సురేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో మర్యాద దినోత్సవం

నిర్మల్ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నెల 3వ శుక్రవారం ప్రయాణికుల మర్యాద దినోత్సవం జరుపుతున్నట్లు డిపో మేనేజర్ కే. పండరి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో మేనేజర్ కే. పండరి అన్ని బస్సులలో ఎక్కి ప్రయాణికులకు గులాబీ పువ్వు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ దేవాపాల, బస్టాండ్ కంట్రోలర్లు బీబీ గౌడ్, టీపీ రమణ గజపతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

దస్తురాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రగుంట గ్రామానికి చెందిన జాదవ్ రమేష్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. అతని పదవ తరగతి మిత్రులు తన స్నేహితుడి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించి, పిల్లల చదువు కోసం రూ. 33,000ల నగదును ఆ కుటుంబానికి అందజేశారు.

కడెం ప్రాజెక్టులో దూకి యువకుడి ఆత్మహత్య

కడెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన పుట్టపాక రాజు(25) గురువారం అర్ధరాత్రి వారి కుటుంబ సభ్యులకు కడెం ప్రాజెక్టులో దూకుతున్నట్లు మెసేజ్ పెట్టాడు. దీంతో వారికుటుంబ సభ్యులు శుక్రవారం ప్రాజెక్టు ప్రాజెక్టులో గాలించగా మృతదేహం లభించింది. రాజు మృతి చెందడంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రాజు మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఖానాపూర్‌లో ఘనంగా మహాలక్ష్మి పండుగ

ఖానాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్‌లోని శివాజీనగర్ కాలనీలో గల మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం మహాలక్ష్మి పండుగను ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మి పండుగను పురస్కరించుకొని భక్తులు భారీగా తరలివచ్చి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో బీజేఎల్పీ నేత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ సహా పలువురు నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ, స్థానిక భక్త బృందం ఆధ్వర్యంలో మహేశ్వర్‌రెడ్డి, రితేష్ రాథోడ్‌లను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ మహేందర్ ఉన్నారు.

అనుమానాస్పదంగా వృద్ధుడి మృతి

కుభీర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చాతా గ్రామానికి చెందిన రాళ్లపల్లి బలరామ్‌గౌడ్(70) అనే వృద్ధుడు శుక్రవారం అనుమానాస్పదంగా మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడు రోజు తెల్లకల్లు విక్రయిస్తూ జీవనం కొనసాగించేవాడని తెలిపారు. మృతుని కుమారుడు రమేష్‌గౌడ్ దంపతులు తమ బంధువుల శుభకార్యానికి వెళ్లారని పేర్కొన్నారు. రోజుమాదిరిగానే తన ఇంటి ఆవరణలో కల్లు విక్రయించి రాత్రి పడుకున్నాడు. ఉదయం 9 దాటిన బట్టి తెరకవ పోవడంతో గ్రామస్తులు గేటు దగ్గరికి వెళ్లి చూడగా గేటు, ఇంటి తలుపులు తెరిచే ఉన్నాయని దగ్గరికి వెళ్లి చూడగా హాల్‌లో రక్తపు మడుగులతో విగతజీవిగా పడి ఉన్నాడని తెలిపారు. పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు, భైంసా ఏఎస్పీ అవినాష్ చేరుకొని ఫింగర్ ప్రింట్స్, డాగ్ స్క్వాడ్‌తో వివరాలను సేకరించారు. దాదాపు రెండు గంటల పాటు విచారణ చేపట్టారు. గ్రామస్తులు కుటుంబీకులతో మాట్లాడారు. మృతుని కుమారుడు రమేష్‌గౌడ్ ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై కృష్ణరెడ్డి కేసు నమోదు చేసి పంచనామ నిర్వహించారు. పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం దర్యాప్తు ప్రారంభించి నిందితులను త్వరలో పట్టుకొని చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

కుంటాల, జూలై, 18 : (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం దృష్ట్యా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. శుక్రవారం కుంటాల మండలంలోని సూర్యాపూర్, దౌనెల్లి, తదితర గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాలలో మురికి కాలువలు శుభ్రం చే యించాలని, జనావాసాల మధ్య నీరు నిల్వకుండా చూడాలని, తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని సూచించారు. అంతేగాకుండా హరితహారం నర్సరీలను ఆయన పరిశీలించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఎక్కువ మొత్తంలో మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. చెత్త సేకరణ షెడ్లలో సేంద్రియ ఎరువు తయారీని పరిశీలించారు. ఈయన వెంట ఎంపీడీవో వనజ, ఎంపీవో రహీం, ఏపీవో నవీన్, పంచాయతీ సెక్రటరీలు ఉన్నారు.

ఉమ్రి(కే)లో అన్నబాహుసాఠే వర్ధంతి

తానూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో సాహిత్య సామ్రాట్ అన్నబాహు సాఠే యొక్క 56వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈస ందర్భంగా అన్నభావు సాఠే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిటీ అధ్యక్షులు చిలింకర్ లక్ష్మణ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పోరాడిన వ్యక్తి , కార్మికుల కోసం పాటు పడిన వ్యక్తి ఎవరయిన ఉన్నారంటే అది కేవలం డాక్టర్ అన్నబావు సాఠే అని కొనియాడారు. ఆగష్టు 1వ తేదిన అన్నబావుసాఠే జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిలింకర్ సాయి, చిలింకర్ చంద్రకాంత్, చిలింకర్ శ్రావణ్, గ్రామస్తులున్నారు.

కుభీర్ : మండల కేంద్రం కుబీర్‌లో శుక్రవారం అన్నబాహుసాఠే వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రం కుబీర్‌లోని బస్టాండ్‌లో గల అన్నాబహుసాఠే విగ్రహానికి పూలల మాలలు వేసి నివాళులర్పించారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్సైలు శంకర్, సుప్రియ

బెదిరించి డబ్బులు వసూలు చేసిన నిందితుల అరెస్ట్

భైంసా రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15వ తేదీన రాత్రి సమయంలో హజ్గుల్ ఎక్స్ రోడ్ వద్ద కారులో ఉన్న రాజు, లక్ష్మణ్‌ను దత్తూరి వినోద్, సిందే దినేష్ దుండగులు చందుతామని బెదిరించి వారి దగ్గర నుంచి రూ. 10 వేలు, ఫోన్ తీసుకొని పారిపోయారు. బాధితులు భైంసా రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు శుక్రవారం ఎస్సైలు శంకర్, సుప్రియ విలేకరుల సమావేశం నిర్వహించారు. భైంసా రూరల్ పోలీసులు జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి తనిఖీ నిర్వహించారు. ఫోన్ కాల్ లోకేషన్, సీసీ ఫుటేజ్ సహాయంతో గురువారం మధ్యాహ్నం భైంసా ఏపీ నగర్‌కు చెందిన దత్తూరి వినోద్, సిందే దినేష్ నిందితులను భైంసా బైపాస్ రోడ్డు వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్సై శంకర్, సుప్రియ తెలిపారు. వీరి వద్ద నుండి 1070గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జల్సాలకు అలవాటు పడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే కోరికతో ఇటువంటి పనులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఎవరైనా అపరిచితుల వ్యక్తులు వచ్చినచో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని లేదా 100కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ నైలు, ఎస్సై శంకర్ సుప్రియ బృందం ఉన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన మహిళలు

బాసర,జూలై18(ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యకు యత్నించిన వ్యకిని సాహసించి ఇద్దరు మహిళలు ప్రాణాలతో రక్షించిన ఘటన శుక్రవారం బాసర గోదావరి నది తీరంలో చోటుచేసుకుంది. పూర్తి వివరాలలోకి వెళ్తే నిజామాబాద్ పట్టణం పులాంగ్ ప్రాంతానికి చెందిన మామిడి సాయిబాబా ఆర్టీసీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి రిటైర్ అయ్యారు. ఇంట్లో వ్యక్తిగత కారణాల వల్ల మనస్థాపం చెందిన ఆయన శుక్రవారం బాసర వచ్చి నది తీరానగల స్నాన ఘట్టం వద్ద గోదావరి నదిలోకి వెళ్లి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. అక్కడే భక్తులు వేసే నాణేల కోసం కోసం వెతుకుతున్న ఇద్దరు మత్స్యకారుల కుటుంబాలకు చెందిన మహిళలు గమనించి మొదట కేకలు వేశారు. నీట మునిగిపోతున్న సాయిబాబాను కాపాడేందుకు మొదట తోకల గంగామణి అనే మహిళ సాయిబాబా జుట్టును పట్టుకొని నీటిలో మునిగిపోకుండా ప్రయత్నించింది. నది ఒడ్డు చేర్చాలంటే.. దూరంగా ఉంది. గంగామణి ఒక్కరే బయటకు తెచ్చే పరిస్థితి లేదు.. కొంచెం పట్టు తప్పినా సాయిబాబాతో పాటు గంగామణి నీట మునిగిపోయే ప్రమాదం ఉంది. దీన్ని గమనించిన మహిళ కంబోలి గంగామణి నీటిలో ఈదుకుంటూ వెళ్లి ఆ తెప్పని లాక్కుంటు ఒడ్డు వరకు తెచ్చారు. ఇలా ఆత్మహత్యకు యత్నించిన సాయిబాబాను ఇద్దరు గంగామణిలు ప్రాణాలతో రక్షించారు.



వృద్ధుడిని ఒడ్డుకు చేరుస్తున్న మహిళలు

ఇద్దరు మహిళలను స్థానిక పోలీసులు అభినందించారు. సాయిబాబాను కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా భావించాలి

● ఖానాపూర్ సీఐ అజయ్ కుమార్

ఖానాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఖానాపూర్ సీఐ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని మస్కాపూర్ గ్రామంలో గల వాసవి స్కూల్‌లో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి చిన్నారి తన పుట్టిన రోజున మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాథోడ్ రాము నాయక్, ప్రిన్సిపాల్ హర్షవర్ధని, డైరెక్టర్ పుప్పాల సాగరిక కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, తదితరులున్నారు.

ఇటిక్యాల్ తండాలో వెలుగని వీధి దీపాలు

పెంబి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల్ తండాలో 20 రోజుల నుంచి విద్యుత్ వీధి దీపాలు వెలుగడం లేదు. వీధి దీపాలు వెలుగక పోవడంతో రాత్రి సమయంలో బయటకు రావాలంటే భయంగా ఉందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి వీధి దీపాలు వెలిగేలా గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బోనాల పండుగకు ఏర్పాట్లు చేయండి

భైంసా, జూలై 18 (ఆంధ్రజ్యోతి): భైంసా పట్టణంలో ఆదివారం జరిగే బోనాల పండుగకు ఏర్పాట్లు చేయాలని హిందూ ఉత్సవ సమితి కోరింది. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్‌కు హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు పెండేప్ కాశీనాథ్ నేతృత్వంలోని సభ్యులు వినతి పత్రం అందజేశారు. ప్రముఖ గట్టు మైసమ్మ ఆలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, ఇందుకు తగ్గ వసతులు, ఏర్పాట్లు చేయాలని కోరారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌లో సీఐ గోపినాథ్‌ను కలిసి బందోబస్తు విషయంలో వినతి పత్రం అందజేశారు. పంజేషా చౌక్, మదీనా కాలోనీ (కాలేజ్ రోడ్) మీదుగా మైసమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలో పికెటింగ్‌లు, బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. బోనాల పండుగ ప్రశాంతంగా జరిగేలా పోలీసులు సహకరించాలని కోరారు. ఇందులో హిందూ ఉత్సవ సమితి సభ్యులు కుమార్ యాదవ్, సుందర్ భయ్యా, మల్లేశ్వర్, పాపన్న, కాసరోల్ల ప్రవీణ్, శ్రీకాంత్ దగ్గే, పొశెట్టి న్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

భైంసా, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయలోకం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో రాజీలేని రీతిలో బాధ్యతాయుతంగా పోరుబాట చేపడుతామని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీ.రమణరావ్ పేర్కొన్నారు. శుక్రవారం భైంసా పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలతో పాటు మండలంలోని మిర్జాపూర్ ప్రభుత్వ పాఠశాలలో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టిన సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఇందులో యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సయ్యద్ అన్సర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సలీం హైమద్, మండల అధ్యక్షులు గంగాధర్, ప్రధాన కార్యదర్శి నంగి కృష్ణ, హెచ్ఎం గంగాప్రసాద్ పాల్గొన్నారు.

కేంద్ర బృందానికి పలు ఫిర్యాదులు

నర్సాపూర్(జి) జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన సభలో నర్సాపూర్(జి)కి చెందిన జాబీర్ అనే వ్యక్తి కేంద్ర బృందం అధికారుల దృష్టికి కొన్ని ఫిర్యాదులు తీసుకొచ్చారు. ఫిష్ పాండ్ పనులను యంత్రాల ద్వారా చేయించారని, ఉపాధి పనుల్లో సెల్ఫీ ఫోటోలు అప్లోడ్ చేశారని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై గత మే 5వ తేదీన కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణికి ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని జాబీర్ గుర్తు చేశారు. 70 రోజులకు పైగా యంత్రాలతో పనులు చేయించి నిధులు దుర్వినియోగం చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

అధికారులకు సన్మానం

తానూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఉత్తమ పీఏసీఎస్ అవార్డు పొందిన హంగీర్గ సొసైటీ పీఏసీఎస్ ఛైర్మన్ నారాయణ్‌రావుపటేల్, సీఈవో భూమయ్య, బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్‌లను శుక్రవారం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఆత్మచైర్మన్ పోతారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉత్తంబాలేరావు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా బోనాల పండుగ



● ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని పలు పాఠశాలల్లో వేడుకలు

ముథోల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): సకాలంలో రాష్ట్రంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే ముథోల్ మండల కేంద్రంలోని రబింద్ర ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'బోనాల పండుగ' ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేషధారణలతో సాంస్కృతి, సాంప్రదాయ దుస్తులతో, బాజాభజంత్రీల మధ్య బోనాలను ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. నృత్యాలు చేశారు. అనంతరం పూజలు నిర్వహించి వండుకొచ్చిన బోనాలను నైవేద్యంగా సమరిపంచారు. పంటలు బాగా పండాలని, అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని వేడుకున్నారు. అనంతరం బోనాల పండుగ విశిష్టతను తెలియపరిచి సాంస్కృతిక నృత్యాలు నిర్వహించారు. పిల్లల వేషధారణలు, సాంస్కృతిక నృత్యాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, డైరెక్టర్ పోతన్న యాదవ్, భీమ్‌రావు దేశ్‌ముఖ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు బోనాల పండుగను జరుపుకోవడం జరిగింది. ఆషాడ మాసం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోచమ్మ తల్లికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తున్నాయని ప్రత్యేక అధికారి విలిత పేర్కొన్నారు. పాఠశాలలో చదివే విద్యార్థినులపై పోచమ్మ తల్లి కృపా కటాక్షం ఉండాలని మొక్కుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మహమ్మద్ హుస్సేన్‌తో పాటు ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.


ముథోల్‌లో బోనాలతో తరలివెళ్తున్న విద్యార్థులు


అమ్మవారికి బోనాలను సమర్పిస్తూ..

● ఖానాపూర్‌లో బోనమెత్తిన విద్యార్థులు

ఖానాపూర్: నిరంతరం పుస్తకాలతో కుస్తీ పడుతూ బిజీబిజీగా గడిపే విద్యార్థులు ఒక్క రోజంతా ఆధ్యాత్మిక మార్గంలో తలమునకలయ్యారు. మండల కేంద్రంలోని కాటలైజర్ లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పడాల ప్రభాకర్ మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలలో బోనాల పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. బోనాల పండుగను పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో విద్యార్థులచే అమ్మవారికి బోనం సమర్పణ, సంప్రదాయ నృత్యాలు, నాటికలు లాంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను చూసేందుకు పాఠశాలకు తరలివచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు బోనాల పండుగ సాంస్కృతిక కార్యక్రమాలను చూసి మంత్ర ముగ్ధులయ్యారు.

నిర్మల్ రూరల్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆదర్శనగర్ వశిష్ట హైస్కూల్‌లో బోనాల పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు అమ్మవారి వేషధారణలో, విద్యార్థులు పోతురాజు విన్యాసాలు చేపట్టి ఆకట్టుకున్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థినులు


నిర్మల్‌లో బోనాల కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు


ఖానాపూర్‌లో బోనాల పండుగలో పాల్గొన్న విద్యార్థులు


..బోనాల ఊరేగింపు కార్యక్రమంలో పోతురాజుల విన్యాసాలు


..పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలు


బోథ్‌లో పోచమ్మ తల్లికి బోనాలను సమర్పిస్తున్న ఉపాధ్యాయులు


ఉట్నూర్‌లోని మండల పరిషత్ కార్యాలయం


ఎన్నికల కోసం సిద్ధం చేస్తున్న ఎన్నికల సామగ్రి

మండల పరిషత్ ఎన్నికలకు అధికారుల సన్నద్ధం

ఉట్నూర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి త్వరలో రానున్న మండల పరిషత్ ఎన్నికల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉట్నూర్ మండలంలో 18 మండల పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాలను ఏర్పాటు చేయడంతో ఉట్నూర్ మండల ప్రజలు 18 మంది మండల ప్రదేశ నియోజక వర్గ సభ్యులు (ఎంపీటీసీ)లను ఎన్నుకున్నారు. చాందూరి, మరుగూడ, శ్యాంనాయక్ తండ గ్రామ పంచాయతీలను కలుపుకొని ఒకటవ రావేజిక నియోజక వర్గాన్ని ఖరారు చేశారు. హస్నాపూర్ గ్రామ పంచాయతీలో హస్నాపూర్ ఎంపీటీసీ స్థానాన్ని, నాగపూర్, టక్కుగూడ, ఎక్స్‌రోడ్డు (లింగోజితాండ),ఉట్నూర్ -1లో 1వ వార్డు నుంచి 4వ వార్డు వరకు , ఉట్నూర్ -2లో 5వ వార్డు నుంచి 8వ వార్డు వరకు, ఉట్నూర్ -3లో తొమ్మిదవ వార్డు నుంచి 13వ వార్డు వరకు, ఉట్నూర్ 4లో 14వవార్డు నుంచి 18వ వార్డు వరకు, లక్కారం-1లో ఒకటవ వార్డు నుంచి ఏడవ వార్డు వరకు, లక్కారం -2లో 8వ వార్డు నుంచి 14వ వార్డు వరకు ఘన్పూర్ ఎంపీటీసీ పరిధిలో మత్తడిగూడ ఘన్పూర్ పంచాయతీలు, గంగాపూర్, కన్నాపూర్ పంచాయతీలు, దంతనపల్లి ఎంపీటీసీ పరిధిలో చెరువుగుడ, దంతనపల్లి, దొంగచింత, కొత్తగూడ, గోండుగూడ పంచాయతీలు, బీర్సాయిపేట ఎంపీటీసీ పరిధిలో హీరాపూర్ జె, బీర్సాయిపేట్, నర్సాపూర్(జె) గ్రామ పంచాయతీల ఓటర్లను చేర్చి మండలంలో మొత్తం 18 ఎంపీటీసీ స్థానాలు ఖరారు చేశారు. ఈ మేరకు ఎన్నికల పేపర్లను కూడా సిద్ధం చేస్తున్నారు.

అడుగుకో గుంత.. తీరని చింత!

బజార్‌హత్నూర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండల కేంద్రం నుంచి భూతాయి వరకున్న రోడ్డుపై జాతర్ల గ్రామం వద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అసలే వర్షాకాలం కావడంతో గుంత ల్లో నీరు నిండి ప్రమాదకరంగా మారాయి. రాత్రి పూట ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. ఈ మార్గం గుండా భూతాయి మీదుగా డెడ్రా, గిరిజాయి, ఉమార్ద, మాన్కనూర్ గిరిజన ప్రజలు పెద్దసంఖ్యలో నిత్యం ప్రయాణిస్తుంటారు. మరోవైపు రోడ్డుకిరువైపుల చెట్లపొదలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలతో ఇబ్బందిగా మారిందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చి రవాణా సౌకర్యాలు మెరుగు పర్చుకోవాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు.


జాతర్ల గ్రామం వద్ద గుంతలమయంగా మారిన రోడ్డు

సీఆర్టీ అభ్యర్థులతో ఐటీడీఏలో సందడి


ఐటీడీఏలో దరఖాస్తులు చేయడానికి వచ్చిన సీఆర్టీ అభ్యర్థులు


సీఆర్టీల దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ఉట్నూర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో కాంట్రాక్ట్ రెసిడెన్సి టీచర్ల భర్తీ కోసం ఐటీడీఏ అధికారులు దరఖాస్తులు ఆహ్వానించడంతో శుక్రవారం నుంచి ఐటీడీఏ లో సందడి వాతావరణం ఏర్పడింది. ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి గిరిజన నిరుద్యోగులు కాంట్రాక్ట్ రెసిడెన్షి టీచర్స్ (సీఆర్టీ) పోస్టుల దరఖాస్తులు సమర్పించడానికి ఉట్నూర్ ఐటీడీఏకు తరలి రావడంతో ఐటీడీఏ కార్యాలయం ఆవరణ సీఆర్టీ అభ్యర్థులతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా జిరాక్స్ సెంటర్లలో కూడా గిరాకీలు పెరిగాయి. ఐటీడీఏ కార్యాలయంలోని అకాడమిక్ మానిటరింగ్ సెల్ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకోవడంతో అక్కడ అభ్యర్థులు గుమ్మిగూడారు. ఒకే కౌంటర్ ఏర్పాటు చేయడం వల్ల మహిళ అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. మహిళలకు పురుషులకు వేరువేరుగా దరఖాస్తులు స్వీకరించే కౌంటర్లు ఏర్పాటు చేస్తే బాగుండేదని సీఆర్టీ అభ్యర్థులు అభిప్రాయపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాలో కేవలం 18 సీఆర్టీ పోస్టులు ఉండగా, నిర్మల్ జిల్లాలో ఏడు పోస్టులు మాత్రమే ఉన్నాయి. దరఖాస్తులు ప్రారంభమైన రోజున వందలాది దరఖాస్తులు అభ్యర్థులు సమర్పించుకున్నారు. మరో 50 సీఆర్టీ పోస్టుల కోసం అధికారులు గత నెలలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలుస్తుంది. ప్రభుత్వం 50 పోస్టులు మంజూరు చేస్తే నిర్మల్ ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న పాఠశాలల్లో 75 పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

ఫొటో న్యూస్


జోడు ఎడ్లపై మూడు దౌరలతో కలుపు తీస్తున్న రైతులు

జోడు ఎడ్లపై దౌరలు మూడు.. రైతన్న ముచ్చెసెను చూడు!!

బజార్‌హత్నూర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల పది రోజులుగా అడపాదడప కురిసిన వర్షంతో రైతులకు చేలల్లో పనులు చేయరాకుండా మారింది. దీంతో పంటలు నాశనమౌతాయా అని ఆందోళన చెందారు. గత వారం రోజులుగా వర్షం ముఖం చాటేయడంతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. కలుపు నివారణ, మందుల పిచికారి పనుల్లో కర్షక లోకం బీజీ అయ్యారు. సమయాన్ని ఆదా చేసుకుంటూ సాగులో నిమగ్నమయ్యారు. సాధారణంగా సమయం ఆదా చేసేందుకు జత ఎడ్లపై రెండు దౌరలతో కలుపు తీస్తారు. కానీ బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి సమీప శివారులోని బాలమోహన్ తన వ్యవసాయ చేనులో జోడెడ్లపై ఒకే కాండి(కర్ర)కు మూడు కలుపు తీసే దౌరలు కట్టి కలుపు తీస్తూ 'ఆంధ్రజ్యోతి' కెమెరా కంట పడగా క్లిక్ మనిపించింది.

'ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలి'

ఉట్నూర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ ఆధ్వర్యంలోని విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులను నియమించకుండా సీఆర్టీల ద్వారా విద్యా వ్యవస్థ కొనసాగిస్తున్నందున ప్రభుత్వం వెంటనే ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలని గిరిజన ఏజెన్సీ డీఎస్సీ సాధన సమితి జిల్లా అధ్యక్షుడు సోమేశ్‌కుమార్ డిమాండ్ చేశారు.శుక్రవారం ఐటీడీఏ కార్యాలయానికి చేరుకున్న సీఆర్టీ అభ్యర్థుల ఆధ్వర్యంలో ఐటీడీఏ ముందు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం 2012లోనే 1175 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేసిందని, అందులో ఆదిలాబాద్‌జిల్లాకు 569 పోస్టులు కేటాయించినప్పటికీ.. ఆర్థిక శాఖ అనుమతులు రాకపోవడంతో ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలు చేపట్టలేదు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత కూడా గత ప్రభుత్వం ప్రత్యేక డీఎస్సీ నిర్వహించ లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించి ఉమ్మడి ఆదిలాబాద్‌లోని గిరిజన నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. లేదంటే నిరుద్యోగ గిరిజన అభ్యర్థుల ఆధ్వర్యంలో కమిషనర్ కార్యాలయం ముట్టడిస్తామని ప్రకటించారు. ఆయన వెంట నిరుద్యోగ యువకులున్నారు.

సంప్రదాయం.. ఆరోగ్యానికి శుభప్రదం!

● బరంపూర్‌లో ఘనంగా గోరింటాకు పండుగ ● ఎర్రగా పండిన గోరింటాకు ● పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళలు


బరంపూర్‌లో సంప్రదాయబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్న మహిళలు


.. గోరింటాకు పెట్టుకుంటున్న మహిళలు

తలమడుగు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయ పండుగలో మహిళలకు ముఖ్యమైన ఆషాఢమాసం పండగ. ఈ పండుగను ఆడపడుచులు ఎంతో ఘనంగా జరుపుకుంటారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని బరంపూర్ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మహిళలు గోరింటాకు పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు గ్రామంలో గల గోరింటాకు చెట్టు ఆకులు తీసుకొచ్చి సంప్రదాయబద్ధంగా రోలు రోకలి బండతో దంచి ముందుగా అమ్మవారికి గోరింటాకు పెట్టి తర్వాత మహిళలందరూ చేతులకు, కాళ్లకు రాసుకున్నారు. గోరింటాకు వల్ల ఆరోగ్యానికి ఎంతో లాభం జరుగుతుందన్నారు. అంతేకాకుండా గోరింటాకు ఎర్రగా పండితే పెండ్లి కానీ ఆడపడుచులకు మంచి భర్త లభిస్తుందన్నారు. అంతేకాకుండా గోరింటాకు వల్ల ఆరోగ్య సమస్యలు కూడా తగ్గిపోతాయని మహిళల పేర్కొన్నారు. ఈ పండగకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.


ఆదిలాబాద్‌లో గోరింటాకు పెట్టుకుంటున్న మహిళలు

ఆదిలాబాద్ టౌన్: ఆషాఢ మాసంలో మహిళలు జరుపుకునే గోరింటాకు కార్యక్రమాలు సందడిగా సాగుతున్నాయి. ఇందులో భాగంగానే శుక్రవారం పట్టణంలోని ఉమా మహేశ్వర ఆలయంలో మహిళలు ఆషాడ మాస గోరింటాకు సంబరాలు జరుపుకున్నారు. ముందుగా భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించి భజన కీర్తనలు ఆలపించారు. అనంతరం ఒకరికొకరు గోరింటాకు అలంకరించుకుని పాటలు పడుతూ సందడి చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జోగు శైలజ, సుజాత, మంగళ, సౌజన్య, గీత, కరుణ, కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

నేరడగొండ: మండలంలోని బుగ్గరాం(బి) గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం గోరింటాకు సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాథోడ్ సునీతతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు గోరింటాకు పెట్టుకున్నారు. తెలుగు లోగిళ్లలో పండుగ అయినా, పబ్బమైనా అమ్మాయిల చేతులు, కాళ్లకు గోరింటాకు తప్పనిసరి, పెళ్లికాని యువతి చేతికి గోరింటాకు ఎర్రగా పండితే మంచి భర్త వస్తాడని, గర్భిణుల అరచేతులు ఎర్రగా మారితే కట్టుకున్నవాడికి చాలా ప్రేమ ఉన్నట్టు అని చమత్కరిస్తారు. ఆడపడుచులంతా ఒక్కచోట చేరి సంబరంగా గోరింటాకు నూరి చేతుల నిండా పెట్టుకుంటూ కబుర్లు చెబుతూ తెగ సందడి చేస్తారు. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకుంటే రుతువు మారిన వేళ కాళ్లు, చేతులు, గోళ్లు శుభ్రపడతాయని, రోగ నిరోధకంగా పనిచేయడంతో అంటువ్యాధులను కూడా దూరం చేస్తుందని వైద్యులు సైతం చెబుతున్నారు.



కూలర్‌లోని నీటి నిల్వలను ఖాళీ చేస్తున్న కమిషనర్ రాజేష్ కుమార్, తదితరులు

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

భైంసా, జూలై18 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రజలందరూ వ్యక్తిగత శుచి, శుభ్రతను పాటిస్తూ పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్ సూచించారు. శుక్రవారం డ్రై డేలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని ఆయాకాలనీవాసులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అపరిశుభ్రతతోనే వ్యాధులు వ్యాప్తి చెందుతాయని సూచించారు. నీటినిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్, మేనేజర్‌గౌరిష్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీష్‌అహ్మద్, మెప్మా ప్రతినిధి సావిత్రిలు ఆయాకాలనీల్లో అనారోగ్యంతో బాధపడుతున్నవారిని గుర్తించి ఆరోగ్య, ఆశాకార్యకర్తల దగ్గర మందులను అందింపజేశారు. పలు ప్రాంతాల్లో కూలర్లు, డ్రమ్‌లు, టైర్లలోనిలిచిన నీటిని మున్సిపల్ అధికార యంత్రాంగం ఖాళీ చేయించింది.

వేతనాలు చెల్లించాలని ఎంపీడీవోకు వినతి

సారంగాపూర్, జూలై18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాలలో జాతీయ ఉపాధిహామీలో పని చేస్తున్న సిబ్బంది వేతనాలను విడుదల చేయాలనీ ఎంపీడీవో లక్ష్మీకాంతారావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఉపాధిహామీ సిబ్బందిని దృష్టిలో ఉంచుకొని నాలుగు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

- ఖరారైన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు
- జిల్లాలో పెరిగిన ఓ ఎంపీటీసీ స్థానం
- రిజర్వేషన్లపైనే ఆశలు • మొదలైన సన్నాహాలు
- మారుతున్న పల్లె వాతావరణం
- అస్త్రాలు సిద్ధం చేసుకుంటున్న పార్టీలు



స్థానికం దిశగా..

నిర్మల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు ఖరారు కావడంతో ఇక స్థానిక సమరం ఊపదుకోబోతోంది. జిల్లాలో మొత్తం 18జడ్పీటీసీ స్థానాలు ఉండగా 156 ఎంపీటీసీ స్థానాలకు గానూ మరో ఎంపీటీసీ స్థానం అదనంగా పెరిగింది. దీంతో 157 ఎంపీటీసీ స్థానాలు ఖరారయ్యాయి. ఈ స్థానాల సంఖ్య ఖరారు కావడంతో ఎంపీటీసీ , జడ్పీటీసీ పదవులకు పోటీ చేసే ఔత్సాహికులు ఇక రిజర్వేషన్ల ఆధారంగా తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. నిర్మల్ జిల్లాలో మొత్తం 18 జడ్పీటీసీ స్థానాలుండగా మెజార్టీ స్థానాలు దక్కించుకున్న పార్టీకి జడ్పీ ఛైర్మన్ పదవి దక్కనుంది. జిల్లాలో కీలకంగా నిలిచే జడ్పీచైర్మన్ పదవిపై అటు అధికార కాంగ్రెస్ పార్టీ రెండు నియోజకవర్గాలకు నేతృత్వం వహిస్తున్న బీజేపీ పార్టీలు దృష్టి సారించాయి. ఈ రెండు పార్టీల్లోని పలువురు సీనియర్ నాయకులు జడ్పీ ఛైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. వీరు మొదట జడ్పీటీసీగా గెలిచేందుకు ఇప్పటినుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు. జడ్పీటీసీ గెలిచిన తర్వాతే ఛైర్మన్ పదవిని ఏ నేతకు కట్టబెట్టాలనే అంశాన్ని ప్రధాన పార్టీలు నిర్ణయించనున్నాయి. రిజర్వేషన్లు తమకు అనుకూలంగా రానట్లయితే రాజకీయంగా తమ ఉనికికి నష్టం వాటిల్లే అవకాశం ఉంటుందని వీరు తమ అనుచరుల వద్ద పేర్కొంటున్నారు. జిల్లాలోని 18 మండలాలకు గానూ ఎంపీపీ పదవులపై దృష్టి సారించిన ప్రధాన పార్టీల నేతలు ఎంపీటీసీ స్థానాన్ని గెలుచుకోవాల్సి ఉంటుంది. ఎంపీటీసీ సభ్యులే ఎంపీపీగా ఎన్నిక కానుండడంతో మొదలు తమ ఎంపీటీసీ నియోజకవర్గంపై పట్టుసాధించుకోవాలని యోచిస్తున్నారు. వీరుకూడా రిజర్వేషన్లు తమకు కూలంగా రావాలని కోరుకుంటున్నారు. దీంతో పాటు జిల్లాలోని 400 గ్రామ పంచాయతీల సర్పంచ్ పదవులకు పోటీచేసేవారు కూడా ఇప్పటినుంచే తమ సన్నాహాల్లో నిమగ్నమవుతున్నారు. అయితే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పార్టీ పరంగా జరగనుండగా సర్పంచ్ పదవులు మాత్రం పార్టీలకు అతీతంగా జరగనున్నాయి. అయినా ప్రధాన పార్టీలు సర్పంచ్ పదవులకు తమ కార్యకర్తలనే రంగంలోకి దించి పరోక్షంగా తమ అభ్యర్థులను ప్రచారం చేయనున్నాయి.

కీలకం కానున్న జడ్పీటీసీ పదవులు

జిల్లాలో అత్యంత ప్రాధాన్యతగల పదవిగా చెప్పుకునే జడ్పీచైర్మన్ పీఠంపై ఇటు బీజేపీ అటు కాంగ్రెస్ సీనియర్ నేతలు ఇప్పటికే సీరియస్‌గా దృష్టి కేంద్రీకరించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మెజార్టీ జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకొని తమ ప్రతిష్ఠను ఇనుమడింపజేసుకోవాలని యోచిస్తోంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. నిర్మల్, ముథోల్ అసెంబ్లీ నియోజకవర్గాలు బీజేపీ నేతృత్వంలో కొనసాగుతున్న కారణంగా ఆ పార్టీ జడ్పీటీసీ ఎన్నికలను సవాలుగా తీసుకోనుంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ముథోల్, నిర్మల్ నియోజకవర్గాల్లో భారీ మెజార్టీ రావడాన్ని కూడా ఆ పార్టీ ప్రతిష్ఠగా భావిస్తోంది. ఎలాగైనా 15 జడ్పీటీసీ స్థానాలను దక్కించుకొని జడ్పీచైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డితో పాటు రామారావు పటేల్ ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టారంటున్నారు. వీరికి తోడుగా స్వతంత్ర్య అభ్యర్థులు సైతం జడ్పీటీసీ పోటీకి ఇప్పటి నుంచే సిద్ధమవుతుండడం ఆసక్తిని రేకేత్తిస్తోంది.

ఎంపీపీ పదవులు కీలకమే..

జిల్లాలో మొన్నటివరకు 18 మండలాలకు 156 ఎంపీటీసీ స్థానాలు ఉండగా తాజాగా మరో స్థానం పెరిగింది. దీంతో ప్రస్తుతం జిల్లాలో 157 ఎంపీటీసీ స్థానాలు ఉండనున్నాయి. అయితే ప్రతీ మండలంలో మెజార్టీ ఎంపీటీసీ స్థానాలను దక్కించుకున్న పార్టీ ఎంపీపీ పదవిని దక్కించుకోనుంది. దీనికి అనుగుణంగానే అధికార కాంగ్రెస్ పార్టీ బీజేపీలు ఇప్పటినుంచే ఎంపీటీసీ నియోజకవర్గాల పరిధిలో తమ అభ్యర్థులుగా బలమైన వారిని బరిలోకి దించాలని యోచిస్తున్నాయి. జిల్లాలోమెజార్టీ ఎంపీపీ పదవులను తమ ఖాతాలో వేసుకునేందుకు ఈ రెండు పార్టీలు ఇప్పటినుంచే ముందస్తు సన్నాహాలు మొదలుపెట్టాయి. అయితే రిజర్వేషన్లు తలకిందులయ్యే అవకాశాలు ఉండడంతో ఆ దిశగానే పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేయనున్నాయి.

సర్పంచ్ పదవులపైనా పార్టీల దృష్టి

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో పాటు సర్పంచ్ పదవులకు జరిగే ఎన్నికలపైనా ఆ పార్టీలు దృష్టి సారిస్తున్నాయి. పార్టీలకు అతీతంగా జరిగే సర్పంచ్ ఎన్నికలను కూడా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోనుండడం ఆసక్తిని రేకేత్తించనుంది. ఈ రెండు పార్టీలు గ్రామ పంచాయతీల్లోని బలమైన మద్దతుదారులను రంగంలోకి నిలిపేందుకు ఇప్పటినుంచే తలమునకలవుతున్నాయి. సర్పంచ్ కోసం పోటీ చేయాలనుకునే ఆశావహులు ఆ దిశగా సన్నాహాలు చేసుకుంటున్నారు. సీనియర్ నేతలను కలుస్తూ బరిలోకి ఉండబోతున్నామన్న సంకేతాలిస్తున్నారు. అన్ని పార్టీల్లో ఒక్కో గ్రామం నుంచి ఇద్దరు ముగ్గురికి పైగా సర్పంచ్ పదవులకు పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతుండడంతో ఈ పార్టీలు చివరి వరకు మౌనంగా ఉండి గెలిచే వారిని తమ అభ్యర్థులుగా ప్రకటించుకునే అవకాశాలున్నాయంటున్నారు.



ఆలయంలో హారతి తీసుకుంటున్న మంత్రి శ్రీధర్‌బాబు

త్వరలో బాసర మాస్టర్‌ప్లాన్ అమలు

- పుణ్యక్షేత్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ట్రిపుల్ ఐటీని నెలకొల్పింది కాంగ్రెస్ ప్రభుత్వమే : ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

బాసర, జూలై18 (ఆంధ్రజ్యోతి): బాసర మాస్టర్‌ప్లాన్ త్వరలోనే అమలు చేసి సరస్వతీ అమ్మవారి క్షేత్రాన్ని అభివృద్ధి చేయనున్నట్లు ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. మంత్రి గురువారం రాత్రి బాసరకు చేరుకుని ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో బసచేశారు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులతో సరస్వతీ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అంతకుముందు మంత్రికి ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాసరలో నెలకొన్ని సమస్యలు, ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఆలయ వైదికసిబ్బంది మంత్రిదృష్టికి తెచ్చారు. శృంగేరిపీఠం ఆమోదించిన ఆలయ విస్తరణ పనుల గురించి మంత్రికి వివరించారు. భూమిపూజ చేసిన ప్రభుత్వంవద్ద అనుమతులు పెండింగ్ కారణంగా అమ్మవారి ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభించలేని విషయాన్ని చెప్పారు. దీనిపై మంత్రి స్పందిస్తూ మొన్ననే బాసర వచ్చిన దేవాదాయశాఖ మంత్రి కొండాసురేఖకు జిల్లా మంత్రి వివేక్‌కు విషయం గురించి తెలుసా అని ఆరాతీశారు. తప్పకుండా వారితో చర్చించి పెండింగ్‌లో ఉన్న ప్లాన్ ఆమోదం లభించేలా చూస్తానని హామీఇచ్చారు. బాసర క్షేత్ర అభివృద్ధికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. గతంలో వైయస్సార్ ముఖ్యమంత్రి ఉన్న సమయంలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వమే సరస్వతీ అమ్మవారి క్షేత్రాన్ని గుర్తించి ఇక్కడి ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీని ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆలయం వద్దకు చేరుకున్న మంత్రికి కాంగ్రెస్ నాయకులు ఎం.రమేష్, సంజీవ్‌రావు దేశ్‌ముఖ్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. మంత్రివెంట కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీశర్మిల, భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, ఆలయ ఈవో సుధీర్‌రెడ్డి ఉన్నారు.

'పీఆర్‌టీయూతోనే సమస్యలకు పరిష్కారం'

కుంటాల, జూలై18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో పీఆర్‌టీయూ ముందుండి పోరాడుతుందని మండల బాధ్యులు అంబకంటి సతీష్ అన్నారు. శుక్రవారం మండలంలోని లింబా (కే) పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్నిపాఠశాలల నుంచి ఉపాధ్యాయుల పీఆర్‌టీయూ సభ్యత్వనమోదు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు ఏమైనా సమస్యలు తలెత్తితే పీఆర్‌టీయూ వెన్నంటే ఉండి సమస్యను పరిష్కరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొండ ప్రవీణ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షులు బర్కుంట నవీన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మానాజీగారి సిద్దిరాం, కార్గం మోహన్, కార్యదర్శి శివనాగేందర్, మహిళా ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, పీఆర్‌టీయూ సంఘ సభ్యులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కావాలి

- మందకృష్ణ మాదిగ డిమాండ్

నిర్మల్‌రూరల్, జూలై18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్‌కే కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన దివ్యాంగుల, చేయూత పింఛన్ దారుల మహా సన్నాహక సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఆగస్టు 13న నిర్వహించ తలపెట్టిన దివ్యాంగుల మహా గర్జనను విజయవంతం చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు ప్రకటిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఎస్‌పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, జిల్లాఇన్‌చార్జి నాగభూషణ్, సాగర్, బొబ్బిలి శ్రీను, కల్లెడ సాయి, సాయించంద్, నంద కుమార్, శనిగారపు రవి, శంకర్, తాటికొండనిషిత, మట్ట నవీన, వినోద్ కుమార్, లత పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగను కలిసిన బీజేపీ నాయకులు

పట్టణంలోని ఆర్‌కే కన్వెన్షన్‌హాల్‌లో నిర్వహించిన జిల్లా దివ్యాంగుల చేయూత పింఛన్ దారుల మహాగర్జన సన్నాహక సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మందకృష్ణ మాదిగను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు జిల్లా బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అయ్యన్నగారి భూమయ్య, సీనియర్ నాయకులు అంజి కుమార్ రెడ్డి, నిజామాబాద్ ప్రభారీ ఆడెపు సుధాకర్, సీనియర్ నాయకులు సామ రాజేశ్వర్‌రెడ్డి, నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దశరథ్ పోశెట్టి, స్టేట్ కౌన్సిల్ మెంబర్, తదితరులు పాల్గొన్నారు.

ధృవపత్రాల జారీలో జాప్యం చేయొద్దు

- అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

భైంసా, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల ధృవీకరణ పత్రాల జారీ ప్రక్రియలో జాప్యం జరుగకుండా చూడాలని భైంసా తహసీల్దార్ కార్యాలయ అధికారులను అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ సూచించారు. శుక్రవారం మధ్యాహ్న వేళలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ ఇక్కడి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డు రూములోకి వెళ్లి పలు రికార్డులను పరిశీలించారు. భూభారతి విభాగంలోకి వెళ్లి రిజిస్ట్రేషన్లు నిర్వహించే ప్రక్రియను పర్యవేక్షించారు. ధ్రువీకరణ పత్రాల జారీని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. భూభారతి రిజిస్ట్రేషన్ల నిర్వహణ, నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియపై పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుదారులకు సకాలంలో అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులకు సంబంధించి నోటీసుల జారీ ప్రక్రియలో లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యాలయ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌ను అభినందించారు.

రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్



నర్సాపూర్(జి)లో కేంద్ర బృందం పర్యటన



తిమ్మాపూర్‌లో పశువుల పాకను పరిశీలిస్తున్న అధికారులు

నర్సాపూర్(జి), జూలై 18 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్(జి) మండలకేంద్రంతో పాటు తిమ్మాపూర్ గ్రామంలో కేంద్ర నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం సభ్యులు ఏ.శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి పర్యటించారు. తిమ్మాపూర్‌లో గ్రామసభ నిర్వహించి, ఉపాధిహామీ కూలీలు, ఐకేపీ (ఇందిరా క్రాంతి పథకం) సంఘసభ్యులతో సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంపై ఆరా తీయడంతో పాటు వాటిని సమర్థవంతంగా ఎలా ఉపయోగించుకోవాలో వారికి వివరించారు. ఈ సందర్భంగా టీం సభ్యులు ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించారు. ఇందులో నర్సరీ, పశువుల పాకల నిర్మాణం, ఇంకుడు గుంతలు, హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో భాగంగా ఆయిల్‌పామ్ మొక్కల పెంపకం, అటవీప్రాంతంలో చేపట్టిన నిరవధిక పనులు ఉన్నాయి. పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యటనలో వారితోపాటు డీఆర్‌డీవో (జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ) కార్యాలయ సిబ్బంది, పర్యవేక్షణ అధికారి శ్రీనివాస్, మండల ఉపధి హామీ సిబ్బంది ఏపీవో జగన్, ఇం జినీరింగ్ కన్సల్టెంట్ అనిల్, సాంకేతిక సహాయకులు రవీందర్, సతీష్, క్షేత్ర సహాయకులు నర్సయ్యభీమేష్, గ్రామస్థులున్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, ఎంపీ నగేష్

బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎంపీ

నిర్మల్ చైన్‌గేట్, జూలై18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో యోనెక్స్ సన్‌రైస్ 11వ తెలంగాణ స్టేట్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ 2025 పోటీలను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, ఉమ్మడి నిర్మల్ మండల పరిషత్ అధ్యక్షుడు వి.సత్యనారాయణ గౌడ్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్, జిల్లా, పట్టణ, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

'రాజకీయ లబ్ధి కోసమే ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం'

దస్తురాబాద్, జూలై18 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ లబ్ధి కోసమే ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండల కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. వివిధ సామాజిక మాధ్యమాల్లో ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తులపై శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డిజిటల్ మైక్రో ఫైనాన్స్ చైర్మన్ నిరుద్యోగులను మోసం చేసిన విషయంలో ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎమ్మెల్యేను బదనాం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్, యూత్ అధ్యక్షుడు గుండానరేష్, నాయకులు పుల్యా నాయక్, రమేష్ రావు, శివయ్య, స్వామి, అంజన్న, సురేందర్, శ్రీనివాస్, నరేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ భూమిని కాపాడాలని వినతి

ముథోల్, జూలై18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడ్‌బిడ్ తండాలో గల 359/24 గల సర్వేనెంబర్‌లో ఉన్న మూడు ఎకరాల 30 గుంటల భూమి 1989లో సమ్మక్క-సారలమ్మ దేవాలయం మీద కేటాయించబడిందని, ఆ భూమిని ప్రభుత్వం కాపాడాలని శుక్రవారం ఎడ్‌బిడ్ తండాలో ప్రజలు తహసీల్దార్ శ్రీలతకు వినతి పత్రాన్ని అందజేశారు. అయితే సుమారు ఎనిమిదేళ్ల క్రితం సమ్మక్క - సారలమ్మ ఆలయం పేరుపై ఉన్న భూమిని జాదవ్ రేణుక బాయి పేరు మీద అక్రమంగా మార్చుకొని సాగు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎడ్‌బిడ్ తాండ వాసులు ధూమ్ నాయక్, గజానంద్ నాయక్, శ్యామ్ రావు, అమర్ సింగ్, జే. శ్యామ్ రావు, మాధవ్ రావు దర్న, రాంనాథ్, గణపతి రాథోడ్, జైచంద్, దీప, తదితరులు ఉన్నారు.

వివక్షపై పోరాడిన మహనీయుడు అన్నాబాహుసాఠె

భైంసా,జూలై18 (ఆంధ్రజ్యోతి): అణగారినవర్గాలను చైతన్యం చేసి, కుల వివక్షపై పోరాడిన మహనీయుడు అన్నాబాహు సాఠె అని మోహన్‌రావ్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావ్ పాటిల్ పేర్కొన్నారు. భైంసాలోని దారాబ్జీ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సాహిత్య సామ్రాట్ అన్నాబాహు సాఠె వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుల వివక్ష నిర్మూలన కోసం నిరంతరం పోరాడిన మహాయోధుడు అన్నాబాహు సాఠె అని కొనియడారు. నేటి యువత మహనీయులను ఆదర్శంగా తీసుకుని వారి అడుగు జాడల్లో నడువాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, స్టడీ సర్కిల్ విద్యార్థులు పాల్గొన్నారు.



అన్నబాహుసాఠె చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మోహన్‌రావ్ పాటిల్

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

మామడ, జూలై18 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మామడ మండలం కొరటికల్ గ్రామంలో రూ.14లక్షలతో చేపట్టిన ఇరిగేషన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు. మామడ మండలంలో పలు గ్రామాలకు రోడ్లు వేయించిన ఘనత కేంద్ర నరేంద్ర మోదీదేనని తెలిపారు. ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యంతోపాటు కేంద్ర ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్లు, ఉచిత బియ్యం పంపిణీ చేశామన్నారు. సమస్యలను నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాపురెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి చిన్న లింగారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చిన్నారెడ్డి, మండలం నాయకులు గోవర్ధన్‌రెడ్డి, బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు న్యాయవాది రంజిత్ కుమార్, చక్రపాణి, నాయకులు నర్సారెడ్డి, నరేష్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీడీవో సుశీల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కొరటికల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలకు వీడీసీ రూ. 2లక్షల విరాళం

తానూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోగ్లీ గ్రామ ప్రభుత్వ పాఠశాలకు గ్రామ వీడీసీ రూ. 2లక్షల విరాళం అందజేసింది. ప్రైవేటే పాఠశాలకు దీటుగా గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దాలని వీడీసీ సభ్యులు పేర్కొన్నారు. గత విద్యాసంవత్సరంలో మొత్తం విద్యార్థులు 30మంది ఉంటే, సంఖ్యను ఎలాగైనా పెంచాలన్న ఉద్దేశంతో వీడీసీ, ఉపాధ్యాయులు ఇంటికీ తిరిగి విద్యార్థులు సంఖ్యలో 70-75కి చేరిందని, ఇద్దరు విద్యావాలంటరీగాలను నియమించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మౌనిఖ, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ లచ్చన్న గ్రామపెద్దలు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

కుంటాల, జూలై18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీవో రహీం అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కుంటాలలో నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్లను నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఇందిరమ్మ పథకంలో అర్హులైన లబ్దిదారులు ఇండ్ల నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. ఆయనవెంట సెక్రటరీ రాజాబాబు, తదితరులు ఉన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

నర్సాపూర్(జి), జూలై18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుస్లీ గ్రామంలో పులి భూమేష్(42) గురువారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండలం ఆలూర్‌కు చెందిన భూమేష్ గత మూడేళ్లుగా కూలీ పనికోసం కుస్లీలో నివసిస్తున్నాడు. పని డబ్బులతో ప్రతీరోజు మద్యం తాగేవాడు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన తర్వాత పడుకున్నాడు. ఉదయం లేచి చూడగా ఇంటి ముందున్నరేకుల షెడ్డులో భూమేష్ ఉరేసుకుని మృతిచెంది ఉన్నట్లు మృతుడి భార్య రజిత నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై గణేష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

భైంసా, జూలై18 (ఆంధ్రజ్యోతి): బడిలో ఉండాల్సిన పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఆపరేషన్ ముస్కాన్ ప్రతినిధుల బృందం వెల్లడించింది. శుక్రవారం భైంసా పట్టణంలోని పలు హోటళ్లు, వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేపట్టి పనులు నిర్వహిస్తున్న పిల్లలను పట్టుకొని సంబంధిత వ్యాపార నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఆయా సంస్థల్లో పట్టుకున్న పిల్లలను ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ వ్యాపారులు తమ సంస్థల్లో బడిఈడు గల పిల్లలను పనుల్లో పెట్టుకోరాదని సూచించారు. పనుల్లో పెట్టుకున్న సంస్థల నిర్వాహకులపై చర్యలు తప్పవని తెలిపారు.